

బాబు గారూ ఊరికెట్లా పోయేది?
కూటమి ప్రభుత్వం సూపర్ హిట్ అంటూ ప్రయాణికులను బస్టాండ్‌పాలు చేసింది. అనంతపురం సభకు వందల సంఖ్యలో బస్సులను తరలించడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. 8లో▸



27 నుంచి బన్ని ఉత్సవాలు
దేవరగట్టు బన్ని ఉత్సవాలు ఈనెల 27 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈమేరకు బుధవారం నెరణికి గ్రామంలో పురోహితులు ముహూర్తం ఖరారు చేశారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,626
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 79.798
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 42,064
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 41,553

న్యూస్‌రీల్

బానకచెర్ల నుంచి 32 వేల క్యూసెక్కులు విడుదల

పాములపాడు: బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు నుంచి బుధవారం 32 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఏఈ దేవేంద్ర తెలిపారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరు నుంచి 32వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అందులో తెలుగుగంగ(వీబీఆర్)కు 14,000 క్యూసెక్కులు, జీఎన్‌ఎస్‌ఎస్‌కు 13,000, కేసీ కెనాల్ ఎస్కేప్‌కు 5 వేల క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నట్లు వివరించారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరు నుంచి ఈ ఏడాది జూలై 7 నుంచి ఈ నెల 10వ తేదీ వరకు 156.6548 టీఎంసీల నీరు వచ్చిందని, ఆ నీటినంతా తెలుగుగంగకు 38.8517 టీఎంసీలు, జీఎన్‌ఎస్‌ఎస్‌కు 53.3156, కేసీసీ ఎస్కేప్‌కు 53.3156 టీఎంసీలు, ఎస్కేప్, వీబీఆర్ స్పిల్‌వేకు 64.4875 టీఎంసీల చొప్పున విడుదల చేశామన్నారు.

హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు 10 మంది ఎంపిక



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని షెడ్యూల్డు కులాలకు చెందిన యువతకు హెవీ మోటారు వెహికల్ డ్రైవింగ్ శిక్షణ ఇచ్చేందుకు నిర్వహించిన ఇంటర్వ్యూలో 10 మంది ఎంపికయ్యారు. బుధవారం స్థానిక జిల్లా రవాణా అధికారి కార్యాలయం చాంబర్‌లో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కె.తులసీదేవి ఆధ్వర్యంలో జిల్లా రవాణా అధికారి శివశంకర్ రెడ్డి, ఆర్టీసీ డీఎం వినయ్ కుమార్, డ్రైవింగ్ స్కూల్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌తో కూడిన కమిటీ పారదర్శంగా ఇంటర్వ్యూ నిర్వహించింది. మొత్తం 14 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 12 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారని, వారిలో 10 మందిని ఎంపిక చేశామని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కె.తులసీదేవి తెలిపారు. ఇంటర్వ్యూల్లో ఎస్సీ కార్పొరేషన్ ఈఓ విజయలక్ష్మితో పాటు కమిటీ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మల్లు సురేంద్రారెడ్డి

బొమ్మలసత్రం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా బనగానపల్లె నియోజకవర్గానికి చెందిన మల్లు సురేంద్రారెడ్డిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే రాష్ట్ర వాణిజ్య విభాగం సెక్రటరీగా శ్రీశైలం నియోజకవర్గానికి చెందిన పువ్వాడి భాస్కర్, రాష్ట్ర గ్రీవెన్స్‌సెల్ సెక్రటరీగా శ్రీశైలం నియోజకవర్గానికి చెందిన జెడ్. శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర ఐటీ వింగ్ సెక్రటరీగా డోన్ నియోజకవర్గానికి చెందిన కృపా సాగర్‌రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

వినియోగదారులకు మెరుగైన సేవలు

కర్నూలు(అగ్రికల్చర్): వినియోగదారులకు విద్యుత్ అధికారులు, సిబ్బంది మెరుగైన సేవలు అందించడంపై దృష్టి సారించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయం నుంచి డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కర్నూలు అర్బన్ నుంచే కాకుండా జిల్లాలోని వివిధ మండలాల నుంచి 14 మంది వినియోగదారులు తమ సమస్యలను ఎస్ఈ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ జవాబుదారీతనంతో పనిచేయాలని కోరారు. వర్షాలు పడుతున్నందున ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే స్పందించాలని సూచించారు. కార్యక్రమం కమర్షియల్ డీఈఈ బాస్కర్ పాల్గొన్నారు.



ఈ చిత్రంలోని ఏపీ39 యూవీ–3899 నంబర్ కారు రవాణా శాఖ ప్రాంతీయ అధికారి వినియోగిస్తున్నారు. సొంత కారునే బినామీ పేరుతో వినియోగిస్తూ నెలనెలా బిల్లులు అద్దె రూపంలో పొందుతున్నారు.



అలాగే ఇక్కడ కనిపిస్తున్న రెండు కార్లలో ఏపీ03–టీహెచ్ 3699ను మోటారు వాహనాల తనిఖీ అధికారి (ఎన్‌ఫోర్స్‌మెంట్) రవీంద్ర కుమార్, ఏపీ04 యూఏ 1234 కారును ఎంవీఐ సుధాకర్ రెడ్డి వినియోగిస్తున్నారు. ఇలా ఉమ్మడి



జిల్లాలోని అన్ని రవాణా శాఖ కార్యాలయాల అధికారులు సొంత వాహనాలను వినియోగిస్తూ అద్దెల పేరిట బిల్లులు తీసుకుంటున్నారు.

అధి**కారు**ల అద్దె దోపిడీ!

రవాణా శాఖలో షి'కారు'
- సొంత వాహనాలకు బిల్లులు
- ఇతర రాష్ట్రాల ప్రయాణానికి ఇవే వాహనాలు
- బినామీ పేర్లతో ప్రతినెలా సొమ్ము చేసుకుంటున్న వైనం
- కిమ్మనని పర్యవేక్షణ అధికారులు

కర్నూలు: లక్షల్లో జీతాలు.. బాధ్యతాయుతమైన ఉద్యోగం.. గౌరవప్రదమైన హోదా.. ఇవన్నీ ఉన్నప్పటికీ రవాణా శాఖ అధికారులు కాసులకు కక్కుర్తి పడుతున్నారు. రవాణా శాఖ కార్యాలయాల్లో అద్దె 'కార్ల' దందా యథేచ్ఛగా సాగుతోంది. ఫలితంగా నిరుద్యోగులకు ఉపాధి లేకుండా చేస్తుండటం గమనార్హం. రవాణా శాఖకు ప్రభుత్వం వాహనాలు కొనుగోలు చేసే పరిస్థితి లేకపోవడంతో అవసరమైన వాటిని అద్దెకు తీసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. అందుకోసం ఒక్కో వాహనానికి నెలకు రూ.35 వేలు అద్దె చెల్లించేందుకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. దీన్ని ఆసరాగా చేసుకుని రవాణా శాఖ అధికారులు సొంత వాహనాలు వినియోగించి బినామీ పేర్లతో బిల్లులు చేసుకుంటూ ఏటా ప్రభుత్వ ఆదాయానికి



ఏఎంవీఐ బాబు కిశోర్ వినియోగిస్తున్న కారు (ఏపీ39 యూఈ 8697)

గండి కొడుతున్నారు.

బినామీ పేరుతో బిల్లులు

నెలనెలా బినామీ పేర్లతో బిల్లులు తయారు చేసి ట్రెజరీ కార్యాలయానికి పంపి సొమ్ము చేసుకుంటున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 5 రవాణా శాఖ కార్యాలయాలు ఉన్నాయి. ఆయా కార్యాలయాల్లో పనిచేసే అధికారులు సొంత వాహనాలనే నడుపుకుంటూ ప్రభుత్వం నుంచి అద్దె (బాడుగ) భత్యం పొందుతున్నారు. అద్దె బిల్లులు మంజూరు ఆ శాఖ ఉన్నతాధికారి పర్యవేక్షిస్తున్నారు. వారు కూడా బినామీ పేరుతో సొంత వాహనానికి నెలనెలా బిల్లులు పొందుతున్నందున కిమ్మనలేని పరిస్థితి. ఉప కమిషనర్ మొదలు వాహన తనిఖీ అధికారి వరకు అద్దె కోసం అడ్డదారులు తొక్కుతున్నారు.

నిరుద్యోగులకు దక్కని ఉపాధి

బ్యాంకు రుణాలు, రాయితీ కార్పొరేషన్లతో పాటు ఓనర్ కమ్ డ్రైవర్ వంటి పథకాలను ప్రవేశపెట్టి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నట్లు ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉంటుంది. రవాణా శాఖ అధికారులు సొంత వాహనాలు, తమ బంధువులకు సంబంధించిన పేర్లతో అద్దె ప్రాతిపదికన నడిపిస్తున్నారు. ప్రభుత్వ శాఖల్లో అద్దె వాహనాలు తీసుకోవాలనుకున్నప్పుడు వాహనం పూర్తి కండీషన్‌లో ఉండటంతో పాటు డ్రైవర్‌కు బ్యాడ్జీ నెంబర్‌తో కూడిన లైసెన్స్ ఉండాలి. ప్రతి అధికారి నెలలో, అదీ జిల్లా పరిధిలోనే 2,500 కిలోమీటర్లు తిరగాల్సి ఉంటుంది. ఇందుకు డ్రైవర్ వేతనం, ఇంధనం ఖర్చుతో కలిపి రూ.35 వేల వరకు ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ అవకాశాన్ని రవాణా శాఖ అధికారులు దుర్వినియోగం చేస్తున్నారు.

నిబంధనలు బేఖాతర్...

రవాణా శాఖ అధికారులు వాడుతున్న వాహనాలు జిల్లా పరిధిలోనే వినియోగించాలి. అయితే ప్రతి అధికారి సొంత వాహనాన్నే బినామీ పేరుతో వినియోగిస్తున్నందున వాటిలోనే ఇతర రాష్ట్రాలకు కూడా వెళ్లి వస్తున్నారు. అధికారులు సెలవులో ఉన్నప్పుడు కానీ, సొంత పనులకు కానీ నిబంధనల ప్రకారం వాటిని వినియోగించరాదు. అయితే జిల్లా సరిహద్దులు దాటి ఇతర రాష్ట్రాలకు కూడా ఆ వాహనాలలోనే ప్రయాణిస్తున్నారు. 2500 కిలోమీటర్లకు మించి తిరగరాదనే నిబంధన ఉన్నప్పటికీ సొంత పనుల కోసం వాటిని వినియోగిస్తుండటం గమనార్హం.

మంత్రి కక్ష సాధింపు చర్యలు తగవు

- శిల్పా సేవా సమితి సేవలు అడ్డుకునే కుట్ర
- నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి



మహిళలకు చెక్కులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి

బొమ్మలసత్రం: నియోజకవర్గంలో పేదలకు సేవలు అందిస్తున్న శిల్పా సేవా సమితిపై మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం తగదని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి విమర్శించారు. శిల్పా మహిళా బ్యాంక్ ద్వారా 138 మందికి రూ. 21.84 లక్షల రుణాలు మంజూరు కాగా బుధవారం స్థానిక శిల్పాసేవాసమితి కార్యాలయంలో ఆయన చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కొన్నేళ్లుగా శిల్పా సేవాసమితి ద్వారా శిల్పా మినరల్ వాటర్, శిల్పా సూపర్ మార్కెట్, శిల్పా మహిళా బ్యాంక్, శిల్పా స్కిల్ డెవలప్‌మెంట్‌లాంటి.. ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈసేవా కార్యక్రమాలు అధికారంలో ఉన్నా.. లేకున్నా తాము కొనసాగిస్తూనే వచ్చామన్నారు. ప్రస్తుతం నంద్యాల ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా కొనసాగుతున్న ఎన్‌ఎండీ ఫరూక్ కక్షపూరితంగా వ్యవహరిస్తూ శిల్పా సేవాసమితి చేపట్టే కార్యక్రమాలను అడ్డుకోవాలనుకోవడం తగదన్నారు. సేవా కార్యక్రమాలు జరుగుతున్న ప్రదేశాలలో అన్ని రకాల సేవలు ఖాళీ చేయించాలనే దుర్దేశంతో తమపై ఒత్తిడి తెస్తున్నారని విమర్శించారు. ప్రథమ నందీశ్వర స్వామి దేవాలయ ఆవరణలో ఖాళీగా ఉన్న స్థలంలో పేదలకు తక్కువ ఖర్చుతో శుభకార్యాలు చేసుకునేందుకు శిల్పా సేవా సమితి ద్వారా ఫంక్షన్ హాల్ నిర్మించామన్నారు. అయితే ఇది జీర్ణించుకోలేని కూటమి నేతలు కల్యాణ మండపాన్ని అడ్డుకున్నారన్నారు. సేవా కార్యక్రమాలను కూటమి నేతలు అడ్డుకుంటే తమకు ఎలాంటి నష్టం జరగదని పేద ప్రజలు నష్టపోతారన్నారు. శిల్పా మినరల్ వాటర్‌ప్లాంట్‌లు దాదాపు 40కి పైగా ఉన్నాయని వాటిని ఖాళీ చేస్తే ప్రజలకు తాగేందుకు తీవ్ర ఇబ్బంది నెలకొంటుందని వివరించారు. తమ సేవా కార్యక్రమాలను అడ్డుకునే కూటమి నేతలే సొంత ఖర్చుతో కార్యక్రమాలు కొనసాగేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శిల్పా మహిళా బ్యాంక్ డైరెక్టర్ పూర్ణిమ, మేనేజర్ సరిలీలా తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలతో విలవిల



ఎస్సీ కాలనీలో ఒకే ఇంట్లో ఇద్దరు జ్వరబాధితులు



జ్వరం బారిన పడిన వృద్ధులు

రుద్రవరం: పెద్దకంబలూరు ఎస్సీ కాలనీ ప్రజలు విష జ్వరాల బారిన పడి విలవిల్లాడుతున్నారు. ఇంటికి ఒకరు ఇద్దరు, చిన్నా పెద్ద తేడా లేకుండా మంచాన పడ్డారు. స్థానికంగా హెల్త్ సెంటర్ ఉన్నప్పటికీ అక్కడిచ్చే మందులకు తగ్గడం లేదని పట్టణాలకు పరుగులు తీస్తున్నారు. గ్రామ సర్పంచు భర్త ప్రసాదు కూడా జ్వరం సోకడంతో పట్టణానికి వెళ్లి వైద్యం చేయించుకున్నాడు. గ్రామంలోని మురుగుకుంట కారణంగా దోమలు వృద్ధి చెందడంతో విష జ్వరాలు ప్రబలుతున్నాయని జ్వర పీడితులు జయమ్మ, వరమయ్య, శాంతి దివ్య, సుభాష్, నాగమణి, బాబు, రజని, ఓబులేసులతో పాటు మరి కొంత మంది వాపోయారు. ఎన్నో సార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల నంద్యాలకు వెళ్లి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కుంటను పూడ్చాలని ఫిర్యాదు చేశామన్నారు. గ్రామంలో వెంటనే వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు కుంటను పూడ్చివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కాలేజీ ఫీజు కట్టకుండా.. జల్సాలకు ఖర్చు పెట్టి!

- తల్లిదండ్రులకు తెలియడంతో మనస్తాపం
- గూడ్సు కింద పడి బీటెక్ విద్యార్థి బలవన్మరణం




జగదీశ్వరరెడ్డి (ఫైల్)

జూపాడుబంగ్లా: కుమారుడు బాగా చదివి ప్రయోజకుడు అవుతాడన్న ఆ తల్లిదండ్రుల కల చివరకు విషాదాంతమైంది. చెడు సావాసాలతో చెడు వ్యసనాలు తోడై ఆ యువకుడి ప్రాణాలను బలి తీసుకున్నాయి. కళాశాల ఫీజు జల్సాలకు ఖర్చు పెట్టిన బీటెక్ విద్యార్థి మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తర్తూరు గ్రామానికి చెందిన రమేష్‌రెడ్డి, ఉషారాణి దంపతులకు ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమారుడు జగదీశ్వర‌రెడ్డి (20) తిరుపతిలోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం విద్య అభ్యసిస్తున్నాడు. రెండేళ్లపాటు బాగా చదువుకున్న యువకుడు తృతీయ ఏడాదిలోకి వచ్చే సరికి చెడు వ్యసనాలు అలవర్చుకున్నాడు. కాగా ప్రతి నెల రమేష్‌రెడ్డి తిరుపతికి వెళ్లి కుమారుడి బాగోగులు చూసుకునేవారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ పనులు ఎక్కువగా ఉండటంతో పదిరోజుల క్రితం ఇంటికి వచ్చిన కొడుకుతో ఫీజు ఇచ్చి పంపించాడు. అయితే ఫీజు కట్టలేదని కళాశాల నుంచి ఫోన్ రావడంతో తల్లిదండ్రులు హుటాహుటిన తిరుపతికి వెళ్లి కుమారుడిని విచారించారు. ఫీజు డబ్బులు ఖర్చు అయ్యాయని చెప్పినా.. వారు కుమారుడిని ఏమనకుండా త్వరలో ఫీజు చెల్లిద్దామని నచ్చజెప్పారు. తమతో పాటు ఊరికి రావాలని చెప్పగా.. 'పని ఉంది మీరు వెళ్లండి నేను వెనుకాలే వస్తా' అంటూ చెప్పడంతో వారు మంగళవారం గ్రామానికి చేరుకున్నారు. కాగా కుమారుడు ఇంకా రాకపోవడంతో ఆందోళన చెందుతుండగా తమ కుమారుడు ఇక లేడని సమాచారం అందింది. బుధవారం తెల్లవారుజామున నంద్యాల రైల్వే స్టేషన్‌లో గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు సమాచారం ఇచ్చారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

క్వింటా ఉల్లి రూ.200

- ఒక్క రైతుకూ జమకాని మద్దతు ధర 'వ్యత్యాసం'

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో క్వింటా ఉల్లిగడ్డలకు లభిస్తున్న ధర రూ.200 మాత్రమే. ఈ ధరతో అమ్ముకుంటే రైతు పెట్టిన పెట్టుబడి వ్యయంలో 10 శాతం కూడా దక్కని పరిస్థితి. అయితే కూటమి ప్రభుత్వం మద్దతు ధర రూ.1200 ప్రకటించింది. వ్యాపారులు క్వింటాకు ఇస్తున్న ధర రూ.200 ఉండగా.. వ్యత్యాసం మొత్తం ప్రభుత్వం ఇస్తుందా అనే విషయమై రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ నెల 1 నుంచి 3 వరకు మార్కెట్ యార్డుకు వచ్చిన ఉల్లిగడ్డలన్నింటినీ మద్దతు ధరతో మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసింది. ఇందుకు సంబంధించి ఇప్పుడిప్పుడే రైతుల ఖాతాలకు జమ అవుతున్నాయి. 6వ తేదీ నుంచి వ్యాపారులు కొనగా.. మిగిలిపోయిన ఉల్లిని మార్క్‌ఫెడ్ కొంటోంది. వ్యాపారులు అతి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఒక దశలో క్వింటా రూ.100 ప్రకారం కూడా కొన్నారు. తర్వాతి నుంచి క్వింటా రూ.200 కనిష్ట ధరతో కొంటున్నారు. మద్దతు ధరలో వ్యత్యాసం ఉన్న మొత్తాన్ని ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా నేరుగా రైతుల ఖాతాలకు విడుదల చేస్తుందని అధికారులు చెబుతున్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి వ్యాపారులతో ప్రతి రోజు రెండు విడతలుగా ఈ–నామ్ ద్వారా కొనిపిస్తున్నారు. మద్దతు ధరలో వ్యత్యాసం ఉన్న మొత్తం ఇంతవరకు ఒక్క రైతుకూ విడుదల కాకపోవడం గమనార్హం.



మార్కెట్ యార్డుకు వచ్చిన ఉల్లి

నాడు గరిష్టంగా ఇచ్చిన మద్దతు రూ.300 మాత్రమే..

2016, 2017లో నాటి టీడీపీ ప్రభుత్వం మద్దతు ధర రూ.700 ప్రకటించింది. ఈ ధర కంటే తక్కువ అమ్ముకున్న రైతులకు గరిష్టంగా రూ.300 ఇస్తామని అప్పట్లో ప్రకటించింది. అప్పట్లో రూ.300 లోపు ధరతో అమ్ముకున్న రైతులకు నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మొండిచేయి చూపారు. ఈ సారి క్వింటా రూ.100, రూ.200 ధరతో ఉల్లి అమ్ముకున్న రైతులు అనేక మంది ఉన్నారు. వీరికి బ్యాలెన్స్ అమౌంట్‌ను మార్క్‌ఫెడ్ ఇస్తుందా అనేది రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. ఇంతవరకు ఒక్కరికి కూడా బ్యాలెన్స్ మొత్తం పడకపోవడం పట్ల రైతుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఉపాధి అవకాశాలకు ప్రణాళికలు రూపొందించండి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ విష్ణు చరణ్

నంద్యాల: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రణాళిక రూపొందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ బుధవారం డిస్ట్రిక్ స్కిల్ డెవలప్‌మెంట్ (జిల్లా నైపుణ్యాభివృద్ధి) కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఆసక్తి ఉన్న రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే కోర్సులను గుర్తించి శిక్షణ ఇవ్వాలన్నారు. జిల్లాలోని పెద్ద పెద్ద పరిశ్రమలను సంప్రదించి వారి అవసరాలకు అనుగుణంగా నిరుద్యోగులను తీర్చిదిద్ది ఉపాధి కల్పించాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, జీఎం ఇండస్ట్రియల్, ఐటీడీ ఏపీపీఓ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సీడ్ ఆప్ సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టులో లొంగిపోయిన 'నల్లమల అనకొండ'

ఆత్మకూరురూరల్: రూ.4 కోట్ల అటవీశాఖ సొమ్ము దారి మళ్లించి స్వాహా చేసిన కేసులో ప్రధాన నిందితుడు, ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో పర్యవేక్షణాధికారిగా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన చాంద్‌బాషా బుధవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయమూర్తి ఎదుట లొంగి పోయాడు. నిధులు దుర్వినియోగం కేసులో ఇప్పటికే నలుగురు నిందితులను ఆత్మకూరు పోలీసులు అరెస్టు చేశారు. అయితే ప్రధాన నిందితుడైన చాంద్ బాషా ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నాలు చేశాడు. ఈ క్రమంలో జిల్లా కోర్టు గతంలో మధ్యంతర ఉత్తర్వులు ఇస్తూ కొంత కాలం వరకు అరెస్టు చేయకుండా ఆదేశించింది. కోర్టు ఇచ్చిన గడువు దాటిన తరువాత నిందితుడు అజ్ఞాతంలోకి వెళ్లాడు. చివరకు బుధవారం కోర్టులో లొంగిపోవడంతో జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేద్కర్ 14 రోజుల రిమాండ్‌కు ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్య పరీక్షల అనంతరం నందికొట్కూరు సబ్ జైలుకు తరలించారు. చాంద్‌బాషాను తమ కస్టడీకి ఇవ్వాలని ఆత్మకూరు పోలీసులు స్థానిక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ఆకాశ వీధిలో ఆర్భాటం చేసి.. పాతాళంలో వదిలేసి!

- ట్రయల్ రన్‌కే పరిమితమైన సీ ప్లేన్
- విజయవాడ టూ శ్రీశైలానికి ప్రయాణమంటూ సీఎం గొప్పలు
- పది నెలలు గడుస్తున్నా సిద్ధం కాని డీపీఆర్
- ఇరిగేషన్, అటవీశాఖల అనుమతులపై అనుమానం..?



శ్రీశైల ఆలయం



శ్రీశైలం డ్యాం సమీపంలో నీటిపై సీప్లేన్ (ఫైల్)

శ్రీశైలంటెంపుల్: 'దట్టమైన నల్లమల అటవీ మధ్యలో ప్రవహించే కృష్ణమ్మ పరవళ్లపై ప్లేన్‌లో ప్రయాణించి మధురానుభూతి పొందే అవకాశం కల్పిస్తున్నాం. ఇందులో భాగంగా విజయవాడ నుంచి శ్రీశైలానికి సీప్లేన్ సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తున్నాం. తద్వారా విజయవాడ నుంచి శ్రీశైలానికి తక్కువ సమయంలో వచ్చి స్వామిఅమ్మవార్లను దర్శించుకునే అవకాశం కల్పిస్తున్నాం. ఏపీని టూరిజం హబ్‌గా మారుస్తాం' అంటూ స్వయాన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు శ్రీశైలంలో సీ ప్లేన్ ట్రయరల్ రన్ వేళ అన్న మాటలు. ఇక సీన్ కట్ చేస్తే.. సీప్లేన్ ట్రయల్‌రన్ చేపట్టి ఇప్పటికి పది నెలలు గడుస్తోంది. ఇంకా సర్వేలు, సమీక్షలకే అధికారులు పరిమితమయ్యారు. ఇప్పటికీ డీపీఆర్ సిద్ధం కాకపోవడంతో సీప్లేన్ ప్రయాణం మరింత ఆలస్యమవుతుందని తెలుస్తోంది. సీఎం ప్రచార ఆర్భాటానికే సీప్లేన్ ప్రతిపాదనను తెరపైకి తీసుకువచ్చి ట్రయల్‌రన్ చేసి వదిలేశారని, ఆచరణ చేసేందుకు అంతగా ఆసక్తి చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మల్లన్న భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం టూరిజం అభివృద్ధిలో భాగంగా శ్రీశైలానికి గతేడాది నవంబరు 9న సీప్లేన్ ట్రయల్‌రన్ చేపట్టారు. రాష్ట్ర సీఎం చంద్రబాబు, కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, టూరిజం శాఖ మంత్రి దుర్గేశ్ తదితరులు విజయవాడ పున్నమి ఘాట్ నుంచి సీప్లేన్‌లో శ్రీశైలం పాతాళగంగకు చేరుకున్నారు. సీప్లేన్ ప్రారంభమైతే విజయవాడ నుంచే కాకుండా హైదరాబాద్, బెంగళూర్ తదితర రాష్ట్రాల నుంచి సైతం సీప్లేన్ నడిపేందుకు అవకాశం ఉందని అప్పట్లో పాలకులు, పర్యాటక అధికారులు ప్రకటించారు. భక్తులు, పర్యాటకులు, ప్రభుత్వ ఉద్యోగులు, వారాంతపు సెలవులు ఉంటే ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు తమ సమయాన్ని వృథా చేసుకోకుండా సీప్లేన్ ద్వారా త్వరగా వచ్చి స్వామిఅమ్మవార్లను దర్శించుకుని త్వరగా వెళ్లే అవకాశం ఉండేదని భావించారు. అయితే పది నెలలుగా గడుస్తున్నా ట్రయల్ రన్‌కు పరిమితం కావడంతో కూటమి ప్రభుత్వానికి ప్రారంభంలో హడావుడి చేయడం, ఆ తర్వాత వదిలేయడం సర్వ సాధారణమేనని పలువురు విమర్శిస్తున్నారు.

సర్వేలు, సమీక్షలకే పరిమితం

విజయవాడ నుంచి శ్రీశైలానికి వచ్చే సీప్లేన్ ప్రయాణానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఏడీసీ) అధికారులు డిటేల్డ్ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేస్తున్నారు. శ్రీశైలంతో పాటు అరకు, లంబసింగి, విశాఖపట్నం, కాకినాడ, కోనసీమ, గండికోట, నర్సాపూర్, తిరుపతి, ప్రకాశం బ్యారేజ్ మొత్తం 10 ప్రదేశాలలో టూరిజం పరంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం డీపీఆర్ సిద్ధం చేసే పనిలో నిమగ్నమైంది. ఈ ప్రాజెక్టు రిపోర్టు తయారీకి నాలుగు నెలల క్రితం ఓ ప్రైవేట్ కన్సల్టెన్సీకి నియమించారు. వారు మే నెల నుంచి డీపీఆర్ తయారు చేసేందుకు పనులు ప్రారంభించారు. ఏపీఏడీసీ అధికారులు వారానికి ఒకసారి సర్వేలు, సమీక్షలు నిర్వహిస్తున్నారు. డీపీఆర్‌లో సీప్లేన్ ల్యాండ్ అయ్యే ప్రదేశం, సీప్లేన్ టేక్‌ఆఫ్, టేక్ ఆన్‌కు నీటిలో సుమారు 1.16 కిలోమీటర్ల పొడవు, 120 మీటర్ల వెడల్పు ఉండే ప్రదేశం, పర్యాటకులు సీప్లేన్ ఎక్కేందుకు, దిగేందుకు నీటిపై ప్రత్యేక జెట్టీల ఏర్పాటు, టికెట్టు ధరలు, ఎన్ని ప్లేన్ సర్వీసులను తిప్పాలి, రోజుకు ఎన్ని ట్రిప్పులు, సీప్లేన్ ల్యాండింగ్ వద్ద పర్యాటకులకు విశ్రాంతి తీసుకునేందుకు గదులు, టికెట్టు కౌంటర్, సిబ్బంది తదితర పూర్తి వివరాలను డీపీఆర్‌లో పొందుపరుచనున్నారు. వచ్చే జనవరి నాటికి డీపీఆర్ పూర్తి చేయాలని కన్సల్టెన్సీకి ఆదేశాలిచ్చినట్లు తెలుస్తోంది.

ఇరిగేషన్, అటవీశాఖ అనుమతులు లభించేనా..?

సీప్లేన్ నిర్వహించే ప్రదేశంలో శ్రీశైలం పూర్తిగా నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వ్ పరిధిలో ఉంది. ఇది పూర్తిగా వన్యప్రాణులు, చిరుతలు, పెద్దపులులు అవాసానికి అనువైన ప్రదేశం. ఇక్కడ సీప్లేన్ సేవలు నిర్వహించాలంటే అటవీశాఖ అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. అలాగే సీప్లేన్ టేక్ ఆఫ్, ల్యాండింగ్‌కు డ్యామ్ పరిధిలో ఉండటంతో ఇరిగేషన్ శాఖ అధికారుల అనుమతి కూడా తప్పనిసరిగా కావాల్సి ఉంటుంది. అలాగే ఏవియేషన్, ఇతర శాఖల అనుమతులు తప్పనిసరి. కూటమి ప్రభుత్వం విజయవాడ టూ శ్రీశైలం సీ ప్లేన్ నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించి త్వరితగతిన అనుమతులు అన్ని తీసుకుని సేవలను అందుబాటులోకి తేవాలని పలువురు పర్యాటకులు కోరుతున్నారు.

ఎమర్జెన్సీని తలపిస్తోంది



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎవరైనా వ్యతిరేకంగా మాట్లాడినా, పత్రికల్లో కథనాలొచ్చినా కేసులు పెట్టి వేధిస్తోంది. పత్రికలు ఎప్పుడూ ప్రజల పక్షాన ఉంటాయి. ముఖ్యంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా..ప్రతిపక్ష పాత్రను పోషిస్తాయి. అందులో భాగంగా ప్రభుత్వంలో జరిగే వివిధ అంశాలపై కథనాలు, స్పాట్ వార్తలను ప్రచురిస్తాయి.అయితే మీడియాలో వచ్చే కథనాలపై వివరణ ఇవ్వాల్సిన ప్రభుత్వం..అస్సలు కథనాలే రాయకూడదన్న విధంగా భయపెడుతోంది. సాక్షి ఎడిటర్‌పై పెట్టిన కేసును వెంటనే ఎత్తివేయాలి. ఇచ్చిన నోటీసులను వెనక్కి తీసుకోవాలి. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా విజయవాడ సాక్షి కార్యాలయంలో పోలీసులు తనిఖీలు చేయడం ప్రజాస్వామ్య బద్ధం అనిపించుకోదు. ప్రభుత్వం తన పద్ధతిని మార్చుకోవాలి. లేదంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

– వీవీనాయుడు, రాయలసీమ యువజన పోరాట సమితి అధ్యక్షుడు, కర్నూలు



మీడియా స్వేచ్ఛను హరిస్తోంది



కూటమి ప్రభుత్వం మీడియా స్వేచ్ఛను హరిస్తోంది. జర్నలిస్టులపై కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. ఇటీవల ఎలాంటి నోటీసులు లేకుండా సాక్షి విజయవాడ కార్యాలయంలో సోదాలు చేయడం, ప్రెస్‌మీట్‌లో మాట్లాడిన అంశాలను కవర్ చేసినా సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డికి నోటీసులు ఇవ్వడం... డీఎస్పీల పదోన్నతుల్లో అక్రమాలు జరుగుతున్నాయని, ప్రతిభ ఉన్న వారికి అన్యాయం చేస్తున్నారని రాసిన కథనంపై కూడా ఎడిటర్‌పై కేసు నమోదు చేశారు. మొదటి నుంచి సాక్షిలో వస్తున్న కథనాలను సుమోటోగా తీసుకొని కేసులు పెడుతున్నారు. ఇది పూర్తిగా అన్యాయం. పత్రికలు ఉండేదే ప్రజల కోసం. ప్రభుత్వంలో జరిగే అక్రమాలు, అన్యాయాలను వారి ముందు ఉంచడం ప్రధాన బాధ్యత. అయితే ఆలా చేయకూడదన్న ధోరణితో ప్రభుత్వం అణచి వేయాలని చూడడం అన్యాయం. ఇది ఒకరకంగా ఎమర్జెన్సీని తలపిస్తుంది. ప్రభుత్వం తన విధానాన్ని మార్చుకోవాలి.

–గోరంట్లప్ప, ఏపీడబ్ల్యూజేఎఫ్, రాష్ట్ర కమిటీ సభ్యుడు, కర్నూలు

భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్

నంద్యాల: అనుమానంతో భార్య గొంతు కోసి చంపిన సోమనాథ్‌శర్మను బుధవారం టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నంద్యాల టూటౌన్ సీఐ అస్రార్‌బాషా తెలిపిన మేరకు వివరాలు.. పట్టణంలోని ఎన్‌జీఓస్ కాలనీలో ఉన్న ఓం శాంతి ధ్యాన కేంద్రం వెనుకవైపు ఉన్న గృహంలో గత మంగళవారం తెల్లవారుజామున భార్య శిరీష(45)ను భర్త సోమనాథ్‌శర్మ కత్తితో గొంతు కోసి మెడపై, ఛాతిపై కత్తితో పొడిచి హత్య చేశాడు. మృతురాలు శిరీష బయట అప్పులు ఎక్కువ చేయడం, అప్పులు ఇచ్చిన వారు తరచుగా ఇంటికి వస్తుండటంతో ఆమెపై అనుమానం పెంచుకొని ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. కుమార్తె శ్రీహిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు బుధవారం సోమనాథ్‌ను అరెస్టు చేసి నంద్యాల కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కర్నూలు: గణేష్ నగర్‌లో నివాసముంటున్న వెంకట ప్రసాద్ (31) ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈయనది రుద్రవరం స్వగ్రామం. తండ్రి శ్రీనివాసులు వాణిజ్య పన్నుల శాఖలో పనిచేసేవారు. పదవీ విరమణ అనంతరం కర్నూలులోనే స్థిరపడ్డారు. ఈయనకు నలుగురు కుమారులు కాగా మూడో కుమారుడైన వెంకటప్రసాద్ బజాజ్ ఫైనాన్స్‌లో పనిచేసేవాడు. మద్యానికి బానిసై ఉద్యోగం మానుకుని స్నేహితులతో కలసి అల్లరిచిల్లరగా తిరిగేవాడు. రెండు నెలల క్రితం పచ్చ కామెర్లు సోకడంతో గణేష్ నగర్‌లోని ఒక గదిలో ఉంటున్నాడు. ఆదివారం నుంచి బయటకు రాకపోవడంతో స్నేహితులకు అనుమానం వచ్చి గదిలోకి వెళ్లి చూడగా అనుమానాస్పద స్థితిలో చనిపోయి ఉన్నాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. పచ్చ కామెర్ల వ్యాధితో బాధ పడుతుండగా మద్యం మానుకోమని చెప్పినప్పటికీ వినలేదని, వ్యాధి తీవ్రమై చనిపోయాడని తమ్ముడు వెంకటకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మూడో పట్టణ పోలీసులు తెలిపారు.

డోన్‌లో అంతే!

● అధికార పార్టీ అండతో రెచ్చిపోతున్న కొన్ని వ్యాపార సంఘాలు



పోలీస్ స్టేషన్ వద్ద నిలిపిన దానిమ్మ పండ్ల ఆటో

డోన్: మొన్న చికెన్ అతి తక్కువ ధరకు అమ్ముతున్నారని గెలాక్సీ చికెన్ సెంటర్‌పై దాడిచేసిన చికెన్ వ్యాపారుల సంగతి మరువక ముందే ఇటీవల కొత్తగా ప్రారంభించిన కేరళ మెన్స్‌వేర్ దుకాణం ఎత్తేసే వరకు డోన్ స్థానిక వ్యాపారులు నిద్రపోలేదు. ఇలాంటి జాడ్యం పట్టణంలో రోజురోజుకూ అధికమవుతుందనేందుకు మరో ఘటన చోటు చేసుకుంది. పట్టణంలో అనంతపురం జిల్లా గుత్తికి చెందిన నూర్‌బాషా అనే వ్యాపారి దానిమ్మ పండ్లను కేజీ రూ.120 అమ్మకుండా రూ.60కే అమ్ముతున్నాడనే కారణంతో పండ్ల వ్యాపారుల సంఘం నాయకులు రవి అతనిపై దాడి చేసి తక్కెడ, రాళ్లను ఎత్తుకెళ్లాడు. ఈ విషయంపై బాధితుడు నూర్ బాషా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా, పండ్ల వ్యాపారులు పోలీసులను ఏమాత్రం లెక్కచేయకుండా 'మీ ఇష్టం వచ్చిన పని చేసుకోండి' అంటూ దురుసుగా ప్రవర్తించడం గమనార్హం. బయటి వ్యాపారులు పట్టణంలో వివిధ రకాల వస్తువులను, తినుబండారాలను తీసుకువస్తే ఇన్నాళ్లు జరిగిన తమ దోపిడీ విధానానికి ఎక్కడ తెరపడుతుందోనని సంఘాల ముసుగులో కొందరు వ్యాపారులు బరితెగించి ప్రవర్తిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



కర్నూలు బస్టాండ్‌లో బస్సులు లేని దృశ్యం

బాబు గారూ.. ఊరికెట్లాపోయేది!





బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

కూటమి సర్కారు అనంతపురం సభకు బస్సులన్నీ తరలించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి బుధవారం రాత్రి వరకు బస్టాండ్లలో బస్సులు లేకపోవడంతో మహిళలు , చిన్నపిల్లలు, వృద్ధులు, విద్యార్థులు గమ్యస్థానాలకు చేరుకునేందుకు నానా అవస్థలు పడ్డారు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లలో ఉచిత ప్రయాణమని గొప్పలు పలికిన కూటమి సర్కారు ఆ బస్సులన్నీ అనంతపురానికి తరలించడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పని పరిస్థితిలో చార్జీలు భారమైనా కొందరు సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సుల్లో వెళ్లగా.. మరికొందరు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



సీటు కోసం ప్రయాణికుల అవస్థలు



ప్రయాణికులతో కిక్కిరిసిన బస్టాండ్

నేటి నుంచి క్రీడా పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కర్నూలు అవుట్ డోర్ స్టేడియంలో ఈనెల 11 నుంచి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ ఫెడరేషన్ సెక్రటరీలు విశ్వనాథ్, ఆశా జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫుట్‌బాల్, కరాటే, అండర్-14, 17 బాల బాలికలకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఉమ్మడి జిల్లాల డీఈఓలు శ్యామూల్, జనార్ధన్‌రెడ్డి హాజరై పోటీలను ప్రారంభిస్తారన్నారు.

27 నుంచి బన్ని ఉత్సవాలు

● ముహూర్తం ఖరారు చేసిన పురోహితులు
● అక్టోబర్ 2న మాళ మల్లేశ్వరాస్వామి కల్యాణోత్సవం



నెరణికిలో బన్ని ఉత్సవాలకు పురోహితులు ఖరారు చేసిన ముహూర్తం ప్రతిని విడుదల చేస్తున్న దృశ్యం

హొళగుంద: దసరా పండుగ వచ్చిందంటే ఠక్కున గుర్తుకు వచ్చేది దేవరగట్టు శ్రీమాళమల్లేశ్వరస్వామి బన్నీ ఉత్సవం. రాష్ట్రంలోనే ప్రత్యేకత సంతరించుకున్న ఈ ఉత్సవాలు ఈనెల 27 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈమేరకు బుధవారం నెరణికి గ్రామంలో పురోహితులు ముహూర్తం ఖరారు చేశారు. ఉత్సవాల ఆహ్వాన ప్రతిని ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి, హొళగుంద ఎస్ఐ దిలీప్‌కుమార్‌తో కలిసి ఉత్సవ నిర్వాహకులైన నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తులు, ఆలయ పూజారులు విడుదల చేశారు. త్వరలోనే కరపత్రాలను ముద్రించి అన్ని ప్రాంతాలకు పంపిణీ చేయనున్నట్లు వారు తెలిపారు.

బన్ని ఉత్సవాల నిర్వహణ ఇలా ..

➡ ఈనెల 27వ తేదీ శనివారం దేవరగట్టులో మాత మాళమ్మ మల్లేశ్వరునికి కంకణధారణం, నిశ్చితార్థం.
➡ అక్టోబర్ 2వ తేది గురువారం విజయదశమి రోజున కల్యాణోత్సవం, బన్ని ఉత్సవం, జైత్రయాత్ర.
➡ 3వ తేది శుక్రవారం భవిష్యవాణి (దైవవాణి)
➡ 4న శనివారం సాయంత్రం స్వామి వారి రథోత్సవం
➡ 5న ఆదివారం గొరవయ్యల ఆటలు, గొలుసు తెంపుట, సాయంత్రం దేవదాసీల క్రీడోత్సవం.
➡ 6న సోమవారం మాళమల్లేశ్వర స్వామి విగ్రహాలు నెరణికి గ్రామానికి చేరడంతో ఉత్సవాలు ముగుస్తాయి.

బడి పక్కనే మందు దుకాణం





పడమర ప్రాతకోట పాఠశాల, పాఠశాలను ఆనుకుని ఉన్న కిరాణం దుకాణం వద్ద మద్యం తాగుతున్న దృశ్యం



నెహ్రూనగర్ రామాలయానికి సమీపంలో బెల్టు దుకాణం

పగిడ్యాల: గత ప్రభుత్వంలో మద్యం షాపులు ఎక్కడో ఉండేవి. ఈ ప్రభుత్వంలో గుడి,బడి అనే తేడా లేదు. ఎక్కడ పడితే అక్కడ మద్యం షాపులు కనిపిస్తున్నాయి. కిరాణం, కూల్‌డ్రింక్‌షాపుల్లో కూడా మద్యం విక్రయాలు సాగుతున్నాయి. ఆదాయం కోసం సామాజిక బాధ్యతను కూటమి సర్కారు విస్మరించడంతో ఊరూరా మద్యం ఏరులై పారుతోంది. నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని పగిడ్యాల మండలంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. అధికార పార్టీకి చెందిన ఎంపీ, ఎమ్మెల్యే వర్గీయులు ఏకంగా ఆలయాలు, పాఠశాలల వద్దే మద్యం అమ్ముతున్నారు. దాడులు చేయాల్సిన ఎక్సైజ్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిండటంతో ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది.

సొంత ఆదాయ వనరులతో గ్రామాల అభివృద్ధి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీఓ

కర్నూలు(అర్బన్): గ్రామాల్లో సొంత ఆదాయ వనరులను నిర్లక్ష్యం చేయకుండా ఉపయోగించుకుంటే గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసుకోవచ్చని జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కర్ తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్‌లోని డీపీఆర్‌సీ భవనంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు ' సొంత ఆదాయ వనరులు ' అనే అంశంపై మూడు రోజుల శిక్షణా కార్యక్రమాలు కర్నూలు, నంద్యాల జిల్లాలకు వేర్వేరుగా నిర్వహించారు. ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీపీఓ భాస్కర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో సొంత ఆదాయ వనరులైన పన్నులు, పన్నేతర ములు, ఇతర మార్గాల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవడంలో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆదాయ వనరుల సమీకరణకు సంబంధించి ఉన్న చట్టాలను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. పంచాయతీల్లో ఖాళీ స్థలాలు ఉంటే వాటిని ఉపయోగంలోకి తీసుకురావడం ద్వారా ఆయా గ్రామ పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేసిన వారమవుతామన్నారు. కార్యక్రమంలో ట్రైనింగ్ మేనేజర్ గిడ్డేష్, టీఓటీలు వి.జేమ్స్ కృపావరం, వి.ప్రభాకర్, అస్రఫ్‌బాషా, పి.జగన్నాథం, డీకే దస్తగిరిబాషా తదితరులు పాల్గొన్నారు.

బాల భీముడు



4.9 కేజీల బరువున్న బాలుడు

ఎమ్మిగనూరు రూరల్: గోనెగండ్ల మండలం ఎర్రబాడు గ్రామానికి చెందిన జూబేదా అనే మహిళకు మూడో కాన్పులో బాలభీముడు జన్మించాడు. పురిటి నొప్పులతో బుధవారం ఉదయం ఎమ్మిగనూరు ఏరియా ఆసుపత్రికి వచ్చిన ఆమె మధ్యాహ్నం సాధారణ ప్రసవమైంది. జన్మించిన బిడ్డ 4.9 కేజీల బరువు ఉన్నాడు. ఈసందర్భంగా డాక్టర్ ఫాతిమా మాట్లాడుతూ పుట్టినప్పుడు పిల్లలు సాధారణంగా 2.5 కేజీల నుంచి 3.5 కేజీల వరకు ఉంటారు. 5 కిలోలతో పుట్టడం అరుదుగా జరుగుతుందన్నారు. కాగా ప్రస్తుతం తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు.

13,14న వర్కింగ్ జర్నలిస్టులకు శిక్షణ తరగతులు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులు వృత్తి నైపుణ్యం పెంచేందుకునేందుకు ఈనెల 13,14 తేదీల్లో నిర్వహించే శిక్షణ తరగతులకు సీఆర్ మీడియా అకాడమీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ హాజరు కానున్నారు. ఇందుకోసం ఆయన 12వ తేదీ రాత్రి 9 గంటలకు కర్నూలు చేరుకొని రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో బస చేస్తారు. 13,14 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరిణయ ఫంక్షన్ హాలులో వర్కింగ్ జర్నలిస్టులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. 15వ తేదీ ఉదయం విజయవాడ వెళ్లిపోతారు.

సారా తయారీ మానుకున్న వారికి ప్రత్యామ్నాయ ఉపాధి

● నేర సమీక్షా సమావేశంలో ఎక్సైజ్ నోడల్ డిప్యూటీ కమిషనర్



నెలవారీ నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి

కర్నూలు: సారా తయారీ, రవాణా విక్రయాలు మానుకున్న వారికి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూడాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నోడల్ డిప్యూటీ కమిషనర్ పి.శ్రీదేవి క్షేత్రస్థాయి అధికారులకు సూచించారు. తన కార్యాలయంలో కర్నూలు, నంద్యాల జిల్లాల ఎక్సైజ్ అధికారులతో ఆమె నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. నాటుసారాను సమూలంగా నిర్మూలించడానికి ప్రవేశపెట్టిన నవోదయం 2పై ఎక్సైజ్ స్టేషన్ల వారీగా సమీక్షించారు. ఇప్పటికే సారా రహిత గ్రామాలుగా ప్రకటించిన గ్రామాల్లో తిరిగి సారా తయారీ కాకుండా నిఘా ఉంచి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నోటిఫికేషన్ ఇచ్చిన రెండో విడత బార్లకు దరఖాస్తులు వచ్చేలా చూడండి...

నూతన మద్యం బార్ పాలసీలో భాగంగా ఉమ్మడి జిల్లాలో మొదటి రౌండ్‌లో అనుమతి పొందిన 37 బార్లకు సంబంధించిన వారి చేత రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ కట్టించి బార్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మొదటి విడతలో దరఖాస్తులు రాకుండా మిగిలిపోయిన 9 బార్లకు రీ నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ నెల 14వ తేదీ లోపు వాటికి అప్లికేషన్లు వచ్చే విధంగా గట్టిగా కృషి చేయాలన్నారు. పొరుగు రాష్ట్రాల మద్యం జిల్లాలోకి రాకుండా నిరంతరం తనిఖీలు, దాడులు కొనసాగించాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్ రావిపాటి హనుమంతరావు, కర్నూలు, నంద్యాల జిల్లాల ఎక్సైజ్ అధికారులు (ఈఎస్) మచ్చ సుధీర్ బాబు, రవి కుమార్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, రాముడు, రాజశేఖర్ గౌడుతో పాటు అన్ని స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు సమావేశంలో పాల్గొన్నారు.